క్లుప్తంగా

శ్రావణ మాస ప్రత్యేక పూజలు



మాచర్ల : శ్రావణ మాసం పురస్కరించుకుని పట్టణంలోని దేవాలయాల్లో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి, ఏడో వార్డులోని దుర్గాదేవి, కేసీపీకి వెళ్లే రహదారిలో కనకదుర్గ దేవాలయం, చౌడమ్మ, పోలేరమ్మ, దేవాలయాల్లో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. మహిళలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారి కృపకు పాత్రులయ్యారు. అర్చకులు, ఆయా దేవాలయాల నిర్వాహకులు భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

వెల్దుర్తిలో 66.2 మీ.మీ వర్షపాతం

మాచర్ల : నియోజకవర్గంలోని వెల్దుర్తి మండలంలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం వరకు అత్యధికంగా 66.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ ఏఎస్‌వో శ్యామ్ బుధవారం తెలిపారు. మాచర్ల మండలంలో 58.2 మి.మీ, దుర్గిలో 41.2 మి.మీ, కారెంపూడి మండలంలో 29.4 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వెల్లడించారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన



పిడుగురాళ్ల: సమాచార హక్కు చట్టం –2005పై అవగాహన కల్పించాల్సిన బాధ్యత వ్యవసాయ శాఖ అధికారులపై ఉందని ఏడీఏ శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. బుధవారం పిడుగురాళ్లలోని సచివాలయంలో వ్యవసాయ శాఖ సిబ్బందితో సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని ఏవో నందిపాటి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ రాష్ట్ర సమాచార కమిషనర్ కావలి సునిల్‌కుమార్ ఆదేశాల మేరకు గ్రామ, మండల స్థాయి అధికారులకు, రైతులకు సమాచార హక్కు చట్టం-2005పై పూర్తిస్థాయి అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ యంత్రాంగం పని తీరులో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించే విధంగా ఈ చట్టం పని చేస్తుందని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలలో సమచార హక్కు చట్టానికి సంబంధించిన బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో శ్రీనివాస్‌రెడ్డి, మండల వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

అన్న క్యాంటిన్‌పై సమీక్ష సమావేశం



మాచర్ల : ఆగస్టు 15న జెండా వందన కార్యక్రమాన్ని సంపూర్ణంగా నిర్వహించాలని పురపాలక సంఘ అధికారులకు కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. దీనికి సంబంధించి ఏర్పాట్లకు చర్యలు తీసుకోవాలని సూచించారు. బుధవారం సచివాలయంలో అన్న క్యాంటిన్ నిర్వహణపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ వెంకటదాస్ మాట్లాడుతూ నియోజకవర్గ స్థాయిలో అన్న క్యాంటిన్‌పై పరిశీలన జరిపి పనుల నిర్వహణపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో రెవెన్యూ అధికారి షబ్బీర్‌బాషా, ఏఈ గౌతమి, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్, గ్రామ కార్యదర్శులకు శిక్షణ తరగతులు

నకరికల్లు: మండలంలోని పంచాయతీ కార్యదర్శులకు, సర్పంచ్‌లకు 3 రోజుల పాటు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో డి.జయమణి బుధవారం తెలిపారు. ఈ నెల 12వ తేదీ నుంచి 14వ తేదీ వరకు శానిటేషన్, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, జీపీడీపీ స్క్రూటినీ తదితర కార్యక్రమాలపై శిక్షణ ఉంటుందన్నారు. 12వ తేదీన మొదటిరోజు గ్రామ పంచాయతీ బాధ్యతలు, ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం, పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, చెత్తసేకరణ, వర్మీ కంపోస్టు తయారీ, గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక, థీమాటికల్ జీపీడీపీ తయారీ విధానం తదితర అంశాలపై శిక్షణ ఉంటుందన్నారు. 13వ తేదీన మొదటిరోజు అంశాలతో పాటు పరిపాలన అంశాలపై, 14వ తేదీన వీధిదీపాల ఏర్పాటు, నిర్వహణ, సీసీ చార్జీల చెల్లింపు, ప్రభుత్వ విధానం, పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణపై క్షేత్రస్థాయి పర్యటన, శిక్షణ అంశాలపై పరీక్ష ఉంటుందన్నారు. అన్ని గ్రామాల్లోని పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు విధిగా హాజరుకావాలని సూచించారు.

బిడ్డ ఆరోగ్యానికి తల్లి పాలు శ్రేష్టం



మల్లవరంలో తల్లులు, బాలింతలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ శిరీష



జమ్మలమడకలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ ఉద్యోగులు

మల్లవరం(రెంటచింతల): బిడ్డ ఎదుగుదలకు తల్లి పాలు ఎంతో మేలు చేస్తాయని మల్లవరం ఎంఎల్‌హెచ్‌పీ శిరీష అన్నారు. బుధవారం మండలంలోని మల్లవరం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన తల్లి పాల వారోత్సవాలలో ఆమె మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే తల్లి పాలు పట్టించడం వలన తల్లికి, బిడ్డకు కలిగే ప్రయోజనాలను, పట్టించకపోవడం వలన కలిగే నష్టాలను వివరించారు. బిడ్డ సంపూర్ణ ఆరోగ్యానికి తల్లి పాలు శ్రేష్టమన్నారు. మొదటి 6 నెలల వరకు బిడ్డకు చనుబాలే ఆహారంగా ఇవ్వడం మంచిదన్నారు. దీని వలన బిడ్డకు రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. అలాగే బిడ్డలకు పాలు ఇవ్వడం వలన తల్లులకు ప్రమాదకరమైన రొమ్ము క్యాన్సర్ వచ్చే అవకాశం తక్కువగా ఉంటుందన్నారు. అనంతరం తల్లులు, బాలింతలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం అంజలిబాయి, ఆరోగ్య కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

తల్లి పాలు బిడ్డకు శ్రీరామరక్ష

మాచర్ల రూరల్: బిడ్డ పుట్టిన గంటలోపే ముర్రుపాలు పట్టడం వలన తల్లీబిడ్డల ఆరోగ్యానికి శ్రీరామరక్ష అని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శివలీల అన్నారు. బుధవారం మండలంలోని జమ్మలమడక గ్రామంలో తల్లి పాల వారోత్సవాల సందర్భంగా ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. తల్లి పాలు ఎంతో ఆరోగ్యకరమైనవని, శిశు సంపూర్ణ మానసిక వికాసానికి తల్లి పాలు దోహదపడతాయన్నారు. శిశువులలో రోగ నిరోధక శక్తి పెరిగి దృఢంగా ఉంటారన్నారు. తల్లి పాలపై తల్లులు అవగాహన పెంచుకొని తమ పండంటి బిడ్డలకు మంచి ఆహారాన్ని అందించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు మల్లేశ్వరి, సుజాత లక్ష్మి ఉన్నారు.

తల్లి పాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం

విజయపురిసౌత్: తల్లి పాలతో పిల్లల్లో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని మాచర్ల ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.లీలావతి అన్నారు. బుధవారం మాచర్ల మండలంలో చింతలతండా, పెద్ద అనుపు అంగన్‌వాడీ కేంద్రాలలో తల్లి పాల వారోత్సవాలపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తల్లి పాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, బిడ్డ పుట్టిన గంటలోపు తల్లి పాలు పట్టాలన్నారు. తల్లి పాల ప్రాముఖ్యతపై మహిళలను చైతన్య పరచాలని ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. అనంతరం తల్లులకు బాల సంజీవని కిట్స్ అందజేశారు. గర్భిణులకు సీమంతం చేశారు. కార్యక్రమంలో చింతలతండా 3, 4, పెద్ద అనుపు అంగన్‌వాడీ టీచర్లు మహాలక్ష్మి, శారద, రూప, అఖిల, ధనలక్ష్మి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



గర్భిణులకు సీమంతం చేస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లీలావతి, అంగన్‌వాడీ టీచర్లు

ఏకధాటిగా కురుస్తున్న వాన

దాచేపల్లి : గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుంది. మంగళవారం తెల్లవారుజాము నుంచి బుధవారం కూడా రోజంతా వర్షం కురుస్తూనే ఉంది. ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండటంతో జనజీవనం స్తంభించింది. ప్రజలు ఇంటికే పరిమితం అయ్యారు. నడికుడి–నారాయణపురం మధ్య ఉన్న వాగులో వర్షపు నీరు రోడ్డుపై ప్రవహించింది. దీంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. పలు చోట్ల వాగులు, కాలువలు పొంగి ప్రవహించాయి. పంట పొలాల్లో వర్షపునీరు నిలిచింది. వర్షంధాటికి రోడ్లపై ఏర్పడిన గుంతల్లో నీళ్లు నిలవటంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు.



నారాయణపురం-నడికుడి మధ్య పొంగి ప్రవహిస్తున్న వాగు

ఎట్టకేలకు బ్రిడ్జిపై మట్టి తొలగింపుకు చర్యలు

సాక్షి ఎఫెక్ట్

కారెంపూడి: ఎట్టకేలకు స్థానిక నాగులేరు బ్రిడ్జిపై పేరుకు పోయిన సిల్ట్ తీసే పనిని బుధవారం పంచాయతీ కార్మికులు చేపట్టారు. 'అధ్వానంగా బ్రిడ్జిలు.. ప్రమాదంలో ప్రయాణం' శీర్షికన అధ్వాన స్థితిలో ఉన్న రెండు బ్రిడ్జిలపై సాక్షిలో ఈ నెల 1వ తేదీన కథనం ప్రచురితమైంది. ఈ నేపథ్యంలో అధికారులు తగిన చర్యలు చేపట్టారు. ముందుగా బ్రిడ్జిపై మట్టిని తొలగించి పడిన వర్షం నీరు వాగులోకి పోవడానికి ఏర్పాట్లు చేసిన కానాలను వినియోగంలోకి తీసుకువస్తున్నారు. దీని వల్ల ఇంత కాలం వర్షం నీరు బ్రిడ్జిపై నిల్వ ఉండడం వల్ల వాహనాల రాకపోకలకు పాదచారులకు ఇబ్బందిగా ఉండేది. కానాలు ఓపెన్ చేయడంతో పడిన నీరు పడినట్లు వాగులోకి పోతుంది. దీని వల్ల బ్రిడ్జిపై బ్రిడ్జి లైఫ్ కూడా పెరుగుతుంది. ఇదిలా ఉంటే బ్రిడ్జి పిల్లర్స్‌పై రావి, మర్రి చెట్లు మొలిచాయి. అవి బ్రిడ్జిని దెబ్బతీసేంత పెద్దవిగా ఉన్నాయి. వాటిని కూడా తొలగించాల్సిన అవసరం ఉంది. ఇదిలా ఉంటే సాగర్ కాల్వ అక్విడెట్ వద్ద ఉన్న రోడ్డు బ్రిడ్జి ఎన్ఎస్‌పీ నిర్వహణలో ఉందని ఆర్‌అండ్‌బీ అధికారులు చెబుతున్నారు. అది ఆర్‌అండ్‌బీ రోడ్డులోనే ఉంది. నిర్వహణ ఎవరిదైనా బ్రిడ్జి చాలా ప్రమాదకరంగా ఉంది. తక్షణ మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



బ్రిడ్జిపై మట్టి తొలగించి శుభ్రం చేస్తున్న కార్మికులు

వైభవంగా చెన్నై షాపింగ్ మాల్ ప్రారంభం

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలో చెన్నై షాపింగ్ మాల్ బుధవారం అంగరంగ వైభవంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సినీ నటి అనుపమ పరమేశ్వరన్ హాజరయ్యారు. ముందుగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించి, జ్యోతి ప్రజ్వలన చేశారు. వస్త్ర ప్రపంచంలో ఉన్న నూతన డిజైన్‌లను వంటిపై వేసుకొని చూపించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తక్కువ ధరలకే నూతన డిజైన్లతో కూడిన నాణ్యమైన దుస్తులు చెన్నై షాపింగ్ మాల్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రస్తుతం 25 సినిమాలలో నటించటం జరిగిందని, మరో 7 సినిమాల్లో నటించబోతున్నట్లు తెలిపారు. అనంతరం మాల్ వద్ద ఏర్పాటు చేసిన డీజే టిల్లు 2 లోని పాటకు స్టెప్పులు వేసి ప్రజలను అలరింపజేశారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సినీ నటి అనుపమ పరమేశ్వరన్

నీటి వనరుల సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి

జల్‌జీవన్ మిషన్ జిల్లా కో ఆర్డినేటర్ తేజు నాయక్

కారెంపూడి: వర్షపు నీటిని నిల్వ చేయడంతో పాటు నీటి వనరులను పెంపొందించుకుని అదనపు ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మించి ప్రతి ఇంటికి రక్షిత తాగునీరు అందించాలనేదే తమ శాఖ లక్ష్యమని జల్‌జీవన్ మిషన్ జిల్లా కో ఆర్డినేటర్ తేజు నాయక్ పేర్కొన్నారు. మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో బుధవారం ఆయన గ్రామ సభ నిర్వహించారు. అంతకు ముందు గ్రామంలో పర్యటించారు. కుళాయి ద్వారా నీరు అందని వారి సమస్యలు తెలుసుకున్నారు. వర్షాకాలంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్స్ నీటి శాంపిల్స్ సేకరించి ప్రతి రోజు పరీక్షకు పంపాలని కోరారు. రక్షిత మంచి నీటి పథకాలు లేని చోట ప్రారంభిస్తామన్నారు. ప్రతి ఇంటికి 55 లీటర్ల రక్షిత నీరు అందించాలనేదే తమ శాఖ లక్ష్యమని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా చెరి సగం నిధులతో ఈ పథకాలను అమలు చేస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ పి.సత్యప్రసాద్, స్వచ్ఛభారత్ మండల కో ఆర్డినేటర్ కె.సుబ్బారావు, లక్ష్మీపురం పంచాయతీ కార్యదర్శి పి.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



గ్రామ సభలో మాట్లాడుతున్న తేజు నాయక్

చేనేత సంక్షేమానికి ప్రభుత్వం కృషి

పెదకూరపాడు: చేనేత సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని టీడీపీ జిల్లా కార్యదర్శి అర్తిమల్ల రమేష్ అన్నారు. మండలంలోని లగడపాడు గ్రామంలో పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ చేనేత దినోత్సవం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ సంక్షోభంలో ఉన్న చేనేత రంగాన్ని సంక్షేమంలోకి తీసుకొచ్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వి.అప్పారావు, ముంతాజ్, వి.శివయ్య, ఎం.చంద్రం, యంపరాల వెంకటేశ్వర్లు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

మొబైల్ స్టోర్‌లపై తూనికలు కొలతల అధికారుల దాడులు



పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలో పలు మొబైల్ స్టోర్‌లపై తూనికలు కొలతల అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. పట్టణంలోని గణేష్ మొబైల్ షాపును పరిశీలించగా వస్తువులపై ఎమ్మార్పీ లేకపోవటం, ఆ వస్తువులు ఎక్కడ తయారు చేస్తున్నారన్న సమాచారం లేకపోవటం, రికార్డులు లేకపోవటంతో ఈ షాపుకు రూ.50 వేలు అపరాధ రుసుం విధించినట్లు పల్నాడు అసిస్టెంట్ కంట్రోలర్ ఆఫీసర్ ఎస్.అల్లూరయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో పలు ప్రాంతాల్లోని షాపుల్లో దాడులు నిర్వహించటం జరిగిందని, ఇప్పటి వరకు రూ.36 లక్షల వరకు జరిమానా విధించటం జరిగిందన్నారు. జీఎస్టీ చెల్లించకుండా జీరో వ్యాపారం చేస్తున్నారని దీని వలన ప్రజలకు నాణ్యత లోపం ఉన్న వస్తువులు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారని తెలిపారు. వీరు వినియోగదారులకు ఒక్క బిల్లు ఇచ్చిన దాఖలాలు లేవని.. కొనుగోలు చేసిన వస్తువులకు సంబంధించిన వివరాలు కూడా లేవని, అందుకే ఇటువంటి షాపులపై అపారాధ రుసుం విధించటం జరిగిందని ఆయన అన్నారు. ఈ దాడుల్లో తూనికలు కొలతల శాఖ సీఐ జాన్ సైదా, సిబ్బంది పాల్గొన్నారు.

దమ్ము చక్రాలతో రోడ్లు ఛిద్రం



గురజాల : దమ్ము చక్రాల ట్రాక్టర్లతో రహదారులు అధ్వానంగా తయారవుతున్నాయి. రహదారులు ఛిద్రమై వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారులపై దమ్ము ట్రాక్టర్లు నడపరాదని ఆదేశాలు జారీ చేసినప్పటికీ గ్రామాల్లో అమలు కావడం లేదు. దమ్ము చక్రాల వలన రహదారులు గుంతల మయంగా మారుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దమ్ము చక్రాలతో ట్రాక్టర్లు రోడ్లపై తిరగకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

భారీ వర్షానికి విద్యుత్ స్తంభంపై పడిన చెట్టు



మాచర్ల రూరల్: ఈదురు గాలులతో కురిసిన వర్షానికి విద్యుత్ స్తంభంపై చెట్టు కొమ్మలు పడి పెను ప్రమాదం తప్పిన ఘటన మండలంలోని కంభంపాడు గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే గ్రామంలో రాత్రి నుంచి కురుస్తున్న వర్షానికి రామాలయ రహదారిలో నివాస గృహాల మధ్య ఉన్న రావి చెట్టు ఒక్కసారిగా కుప్పకూలి విద్యుత్ స్తంభంపై పడిపోయింది. కరెంట్ తీగలు ఒకదానికొకటి అంటుకొని మంటలు వ్యాపించాయి. ఆ సమయంలో ఎవరూ లేకపోవటంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు విద్యుత్ అధికారులకు సమాచారమందించి విద్యుత్‌ను నిలుపుదల చేయించారు. వెంటనే వీధిలో ఉన్న చెట్టు కొమ్మలను తొలగించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూశారు. విషయం తెలుసుకున్న రూరల్ ఎస్ఐ రాజశేఖర్ గ్రామానికి చేరుకొని రహదారిలో ఉన్న భారీ కొమ్మలను జేసీబీ సాయంతో తొలగించి విద్యుత్ శాఖాధికారులకు ఇలాంటి సమస్యలు మళ్లీ తలెత్తకుండా చూడాలని సూచించారు.

హస్త కళాకారులు క్వాలిటీ ఉత్పత్తులు తయారు చేయాలి

మాచర్ల ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ రాకేష్



హస్త కళాకారులకు ఇంప్రూవ్డ్ టూల్ కిట్స్ అందజేస్తున్న మేనేజర్ రాకేష్

విజయపురిసౌత్: టై అండ్ డై హస్త కళాకారులు మెరుగైన డిజైన్లు తయారు చేయాలని మాచర్ల స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ మేనేజర్ రాకేష్ అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం పురస్కరించుకుని బుధవారం మాచర్ల మండలం కొత్తూరు గ్రామంలోని వీవర్స్ కాలనీలో మినిస్ట్రీస్ ఆఫ్ టెక్స్‌టైల్స్ డెవలప్‌మెంట్ కమిషనర్ హ్యాండీక్రాఫ్ట్స్ ఆధ్వర్యంలో ఇంప్రూవ్డ్ టూల్ కిట్స్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌బీఐ మేనేజర్ రాకేష్ మాట్లాడుతూ టై అండ్ డై హస్త కళాకారులు వృత్తిలో నైపుణ్యతను ప్రదర్శించాలన్నారు. వారికి పెట్టుబడి కోసం బ్యాంక్ నుంచి సహకారం అందిస్తామని, క్వాలిటీ ఉత్పత్తులను తయారు చేయాలని సూచించారు. అనంతరం 60 మంది హస్త కళాకారులకు ఇంప్రూవ్డ్ టూల్ కిట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో హస్త కళల అభివృద్ధి అధికారి రవీంద్ర గౌతమ్, హస్త కళా సేవా కేంద్రం విజయవాడ పీడీ సుధీర్ కుమార్, పున్నా కృష్ణమూర్తి పాల్గొన్నారు.

వైభవంగా నాభిశిల ప్రతిష్టా మహోత్సవాలు

మాచర్ల రూరల్: మండలంలోని రాయవరం గ్రామంలో మహాగణపతి నాభిశిల ప్రతిష్ఠా మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. వారం రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో గ్రామంలో మహాశీతల గమిడి శిల నాగేంద్ర స్వామి, కురందేవత, పోతురాజు స్వామి వార్ల స్థిర ప్రతిష్టా కార్యక్రమం బ్రహ్మశ్రీ పోతులూరి వీరభద్రాచార్య నేతృత్వంలో వేదమంత్రాలతో బుధవారం నిర్వహించారు. మహిళలు, చిన్నారులు పెద్ద ఎత్తున ప్రతిష్టా ప్రాంగణానికి చేరుకొని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. ఆ ప్రాంగణమంతా భక్తి పారవశ్యంతో పులకించిపోయింది. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. బ్రహ్మశ్రీ పోతులూరి మల్లిఖార్జున స్వామి ప్రత్యేక పర్యవేక్షణ జరపగా, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

అమ్మో వర్షం

ద్విచక్ర వాహనదారుల బాధలు వర్ణనాతీతం





మండలంలో పల్నాటి కోనసీమగా పేరు పొందిన మంచికల్లు గ్రామ ప్రధాన రహదారి చినుకుపడితే చిత్తడి.. చిత్తడిగా మారుతుండటంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం పడితే ఈ రహదారి మాగాణిని తలపిస్తుంది. దాంతో గ్రామస్తులు వర్షం పడుతోందంటేనే భయపడుతున్నారు. ఎన్నో ఏళ్లగా ఈ సమస్య ఉన్నా పరిష్కారానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించిన దాఖలాలు లేవని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. చినుకు పడితే రహదారిపై పేరుకుపోయిన బురద కారణంగా ద్విచక్ర వాహనదారుల బాధలు వర్ణనాతీతం. ఎవరు ఎప్పుడు పడిపోతారో తెలియని పరిస్థితి. వృద్ధులు, చిన్నారులే కాకండా పెద్దలు సైతం భయం.. భయంగా నడవాల్సిన పరిస్థితి నెలకొందని గ్రామస్తులు వాపోతున్నారు. ప్రాథమికోన్నత పాఠశాల కూడా ఈ రహదారి వెంబడి ఉండటంతో విద్యార్థులు స్కూల్‌కు వెళ్తున్న సమయంలో వాహనాల వలన బురుద చింది పడి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికై నా ఈ రహదారి అభివృద్ధికి కృషి చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

– రెంటచింతల

సంక్షిప్త వార్తలు

క్రీస్తును నిత్యం ఆరాధించాలి

మాచర్ల : క్రైస్తవ సేవకులు ఏసుక్రీస్తును నిత్యం ప్రార్థించాలని పాస్టర్ పేతూరురెడ్డి అన్నారు. పట్టణంలోని బేతెల్ మందిర ఆవరణలో పల్నాడు దైవ సేవకుల ఐదో వార్షికోత్సవం బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ పేతూరురెడ్డి మాట్లాడుతూ సంఘ సేవకులుగా పని చేస్తూ మంచిగా జీవించాలన్నారు. ఐదో వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేక్ కట్ చేసి అభినందనలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో పాస్టర్లు మోహన్‌బాబు, పాస్టర్ యోహెసువా, ఏలిషా, బ్రహ్మనాయుడు, ప్రసాద్, క్రైస్తవ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్నదానం

మాచర్ల : ఆర్యవైశ్య సంఘ నాయకులు సుమారు 400 మందికి బుధవారం మధ్యాహ్నం మాచర్ల పట్టణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు సూరె ఎలమంద, రామకృష్ణ, కంభంపాటి అనిల్, కంభంపాటి చంటి, సిరిగిరిపాడు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ సరసింహమూర్తి సేవలు వెలకట్టలేనివి

మాచర్ల : స్వామి వివేకానంద చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో స్వర్గీయ డాక్టర్ నరసింహమూర్తి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు డాక్టర్ జయప్రకాష్, విజయలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో పట్టణంలో పేదలకు వస్త్రాలు పంపిణీ చేసి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీడీపీ నాయకుడు అంకిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు డాక్టర్ నరసింహమూర్తి పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందించి మంచితనాన్ని చాటుకున్నారని అన్నారు. వివేకానంద చారిటబుల్ ట్రస్టు బోర్డు చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి అధ్యక్షత వహించారు. శ్రీనివాస థియేటర్ యజమాని షేక్ జాని, రోటరీ క్లబ్ సభ్యులు, వైద్యులు తదితరులు డాక్టర్ నరసింహమూర్తి సేవలను కొనియాడారు.

తహసీల్దార్‌ను కలిసిన ఏపీ ఎన్జీవో నాయకులు

గురజాల : నూతనంగా గురజాల తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన నగేష్‌ను ఏపీ ఎన్జీవో నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌ను ఘనంగా సత్కరించారు. హనుమంతరావు, అల్లం వాసు, నాగరాజు, లక్ష్మీనారాయణ, శ్రీనివాసరావు తదితరులున్నారు.

పోలీస్‌స్టేషన్‌లో ఎస్పీ ఆకస్మిక తనిఖీ

ముప్పాళ్ళ: ముప్పాళ్ళ పోలీస్‌స్టేషన్‌ను జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా పోలీస్‌స్టేషన్ ఆవరణను పరిశీలించారు. విధుల్లో ఉన్న సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. రికార్డులు, పెండింగ్ కేసుల వివరాలపై ఆరా తీశారు. ఎన్నికలు ముగిసిన తర్వాత జరుగుతున్న గొడవల నేపథ్యంలో తీసుకుంటున్న చర్యలపై పలు సూచనలు చేశారు. సమస్యాత్మక గ్రామాలపై నిఘా పెంచాలని సూచించారు. అనంతరం మాదల గ్రామాన్ని సందర్శించి, స్థానికులతో మాట్లాడారు. సత్తెనపల్లి డీఎస్పీ గురునాథబాబు, రూరల్ సీఐ రాంబాబు, ఎస్సై పి.హజరతయ్య, సిబ్బంది తదితరులు ఉన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ కె.శ్రీనివాసరావు